క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


కమిటీ సభ్యులకు చెక్ అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని ఇలిసిపురంలో భద్రమహంకాళి దేవాలయ పునర్నిర్మాణానికి అడపా పరాంకుశం, వెంకటరత్న జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఆదివారం అందించారు. అడపా నేతాజీరావు, ప్రభాకర్‌లు అమ్మవారి ఆలయానికి వచ్చి చీర, పసుపు కుంకుమలతో రూ.1,00,001 విరాళ చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు


చిన్నారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్తా ఆలయ ఆవరణలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

ఘనంగా తెరవే కవి సమ్మేళనం


విశ్రాంత ఎంఈఓ లింగరాజుకు సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 109వ నెల సాహితీ సమ్మేళనం నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం జరిగింది. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి నిర్వహణలో పలువురు కవితలను చదివి వినిపించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఎంఈఓ తలగాన లింగరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కవులు ఐఎస్‌డీ ప్రసాద్, వి.శ్రీనివాస్‌రావు, ఎం.ఉపేంద్రశర్మ, పి.వి.దుర్గాప్రసాద్, పి.జనార్దనరావు, కిల్లాన శ్రీనివాస్, ఈశ్వరరావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మీసాల



జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ వింగ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నడిమివలస గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేసిందని ఆదివారం తెలిపారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పట్టుశాలి సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సమావేశంలో సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక పట్టుశాలి భవన్‌లో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా మల్లిపెద్ది శివరామకృష్ణ, కార్యదర్శిగా పాలిశెట్టి మధుబాబు, కోశాధికారిగా బస్వా చక్రధరుడు, సలహా మండలి సభ్యులుగా జల్లేపల్లి గిరిధరరావు, అల్లంశెట్టి మహేశ్వరరావు, రాజాపంతుల ప్రకాశరావు, పాలిశెట్టి మల్లిబాబు, డాక్టర మందుల మోహనరావు, కొండవీటి బసవరాజు, ఉపాధ్యక్షులుగా, సంయుక్త కార్యదర్శులుగా నలుగురు చొప్పున ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులంలో నిరుపేదలకు సాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

బడివానిపేటలో వైద్య శిబిరం

ఎచ్చెర్ల : బడివానిపేట గ్రామంలో మహాలక్ష్మీ లైఫ్‌రే ఆస్పత్రి సౌజన్యంతో సర్పంచ్ కారి తాతారావు, మాజీ సర్పంచ్ ఎర్రయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పప్పల సౌజన్య, పాకాల అరుణ్‌కుమారి హాజరై 202 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మా బాధలు పట్టించుకోరా..!

- బోరవానిపేట పంచాయతీలో సమస్యల కొలువు
- రోడ్డు పక్కనే చెత్త కుప్పలు
- తాళ్లవలస పాఠశాల వద్ద మురుగునీరు
- పట్టించుకోని పాలకులు


తాళ్లవలస పాఠశాల సమీపంలో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగునీరు


బోరవానిపేట సచివాలయం సమీపంలో రోడ్డుపక్కనే చెత్త

గార : మండల కేంద్రమైన గార పక్కనే ఉన్న బోరవానిపేట పంచాయతీలో సమస్యలు తిష్ఠవేశాయి. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగించే ఈ పంచాయతీ పరిధిలోని బోరవానిపేట, కాలనీ, తాళ్లవలస, ముద్దపువానిపేట గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తోంది. ప్రధాన రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో అవస్థలు పడుతున్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. సచివాలయానికి వెళ్లే రోడ్డు పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో కుళ్లిపోయి దుర్గంధం వెలువడుతోంది. గ్రామ శివారులో ప్రవహిస్తున్న భైరిదేశిగెడ్డ చానెల్‌లో ఒక్కోసారి చెత్త పడేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రంలో చెత్తను వేయాల్సి ఉన్నా గ్రీన్ అంబాసిడర్లు రోడ్డుకిరువైపులా పడేస్తుండటం వల్ల చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి సంపద కేంద్రంలో కూడా కొన్ని కంపోస్టు బెడ్స్‌లో పిచ్చి మొక్కలు కూడా దర్శనమిస్తున్నాయి. ఉన్న తక్కువ కాలువల్లోనూ పూడిక తీయకపోవడంతో దుర్గంధం, దోమలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాళ్లవలసలో పాఠశాల సమీపంలోని రోడ్డుపై మురుగు నీరు నిలిచిపోతోంది. దీంతో విద్యార్థులతో పాటు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు పంచాయతీ సిబ్బందికి చెప్పినా నీరు తొలగింపు చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు..

మండల కేంద్రం గారకు వెళ్లకుండా కొందరు ఈ రోడ్డును బైపాస్‌గా ఉపయోగిస్తుంటారు. అయితే బీటీ రోడ్డు భాగమంతా గుంతలుగా మారడంతో నీరు నిలిచిపోయి వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. దమ్ము ఐరన్ వీల్స్ ఉన్న ట్రాక్టర్లు వెళుతుండటంతో తొందరగా పాడైపోతోంది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు బాగు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.


చెత్త సంపద కేంద్రంలో కంపోస్టు బెడ్స్‌లో పిచ్చి మొక్కలు


బీటీ రోడ్డులో గుంతల్లో నిలిచిన నీరు

దుర్గంధం వ్యాపిస్తోంది



కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురుగునిండిపోయి దుర్వాసన వస్తోంది. దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్డు పక్కనే చెత్త ఉండటంతో బైక్‌లపై వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది.

– బోర పుణ్యవతి, మహిళా మండలి అధ్యక్షురాలు

ఎక్కడికక్కడ గోతులు



తాళ్లవలస– బోరవానిపేట రోడ్డును బైపాస్‌గా ఉపయోగిస్తుంటారు. రోడ్డు మొత్తం గోతులమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. నాయకులు, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు.

– బోర కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్, బోరవానిపేట

మురుగునీటితో అవస్థలు



తాళ్లవలస పాఠశాల సమీపంలో సీసీ రోడ్డుపైనే మురుగునీరు నిలిచి ఉండిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలువలు లేకపోవడంతో రోడ్డుపైనే వాడుక నీరు నిలిచిపోతోంది. అధికారులు స్పందించాలి.

– కోనారి శేఖర్, తాళ్లవలస

పార్టీ బలోపేతంలో భాగస్వామ్యం కావాలి


మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్టీ ఎస్ఈసీ మెంబర్ గొండు కృష్ణమూర్తి

శ్రీకాకుళం రూరల్/గార : ప్రజలకు అందుబాటులో ఉంటూనే పార్టీ బలోపేతంలో భాగస్వామ్యం కావాలని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. అంపోలుకు చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన సందర్భంగా ఆదివారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో ధర్మానను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ధర్మానను దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించగా.. అనంతరం గొండు కృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, రాష్ట్ర తూర్పు కాపు కుల రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, రాష్ట్ర వెలమ కుల విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, గార ఎంపీపీ, పార్టీ రాష్ట్ర వ్యవసాయ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ గొండు రఘురామ్, మండల పార్టీ అధ్యక్షుడు పీస గోపి, జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, మూకాళ్ల తాతబాబు, పీస శ్రీహరిరావు, శిమ్మ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి గొప్ప మహర్షి


వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : వాల్మీకి గొప్ప మహర్షి అని పెంట వాశిష్ఠ కార్తికేయ శర్మ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'వాల్మీకి మహర్షి–శ్రీరామ ఉపాసన'పై ఆదివారం ప్రసంగించారు. వాల్మీకి జన్మ వృత్తాంతం, వివిధ పురాణాలను వివరించారు. రామాయణంలో ఒక్కొక్క కాండం నుంచి ఒక్కొక్క ఘట్టం ప్రాముఖ్యతను తెలియజేశారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.నరసింహమూర్తి, పట్నాయిక్, వెంకటరమణ, సంగమేశ్వరరావు, బాబూరావు, జోగారావు, స్వామి, సరస్వతి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవరుచుకోవాలి


ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గాజులవీధి, ప్రకాష్‌నగర్ కాలనీ, సరస్వతీ థియేటర్ వెనుక ప్రాంతంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక శ్రీకాకుళం కమిటీ సభ్యులు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. సమితి అధ్యక్షులు సంతోష్‌కుమార్, సభ్యులు ఈశ్వర్‌లాలు, వెంకటరావు, సుధాకర్, వాసు, లక్ష్మీ, సంతోషి, ప్రశాంతి, లావణ్య, మనోజ్ పాల్గొన్నారు.

మహిళల కబడ్డీ పోటీల విజేత శ్రీకాకుళం


టోఫీ అందుకుంటున్న శ్రీకాకుళం జట్టు

నూజివీడు: దసరా సందర్భంగా నూజివీడులో నిర్వహిస్తున్న 73వ అఖిలభారత పురుషుల, మహిళల కబడ్డీ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. మహిళల కబడ్డీ విజేతగా శ్రీకాకుళం జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్ శ్రీకాకుళం–చిత్తూరు జట్ల మధ్య జరగ్గా చిత్తూరు జట్టుపై 40–29 స్కోర్‌తో శ్రీకాకుళం జట్టు గెలుపొందింది. విజేతలకు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నగదు బహుమతులను, ట్రోఫీలను అందజేశారు.

ఆదిత్యా నమోస్తుతే..!


సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు


అంధుడైన కుమారుడిని వెంట తీసుకొస్తున్న ఓ తండ్రి

అరసవల్లి : ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆశ్వీయుజ ఆదివారం, దసరా తర్వాతి కావడంతో ఇతర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి ఆదిత్యున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలు సమర్పించి ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో అవస్థలు పడుతున్న వారు, దివ్యాంగులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్ ఏర్పాట్లు చేయగా, అంతరాలయంలో గోత్రనామాలతో సవ్యంగా పూజలు జరిగేలా ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం చర్యలు చేపట్టింది. పలువురు ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖుల కుటుంబసభ్యులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ సిబ్బంది దర్శనాలు చేయించారు.

చీడిపేటలో అన్నదానం

జి.సిగడాం: రాజాం–శ్రీకాకుళం ప్రధాన రహదారి వాండ్రంగి గ్రామ పంచాయతీ చీడిపేట కూడలి వద్ద దుర్గాదేవి నవరాత్రులు సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. సుమారు 6వేల మంది జనం హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు.

కార్యకర్తలతో సమావేశం నేడు

రణస్థలం: ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడు, పూడివలస, ఇబ్రహీంబాద్, కుశాలపురం, దోమాం పంచాయతీల్లో సోమవారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరామ్ రెడ్డి ఆదివారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



దీపావళి–బలరాంపురం రోడ్డు నుంచి మెండపేట, రాళ్లపేట, అర్బన్ హౌసింగ్ కాలనీలకు వెళ్లే రోడ్డు మలుపులో గొయ్యి ఏర్పడింది. పైపు కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో పాటు అధిక బరువు వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుండటంతో ఈ రంధ్రం ఏర్పడింది. స్థానికులు గొయ్యి వద్ద తాత్కాలికంగా తాటికమ్మలు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– గార

ఎంటీఎస్ వర్తింపజేయాలని వినతి


సూర్యనారాయణతో అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్ : వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలోని టీటీడీ కల్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రిటైర్‌మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, కృష్ణ, అమృత, రాము, రాజు, పి.రాహుల్, కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ఎచ్చెర్ల : కొయ్యాంలో పాడైన బీటీ రోడ్డును ఏఎంసీ మాజీ చైర్మన్ జీరు రామారావు, సర్పంచ్ జీరు అయ్యప్పరెడ్డిలు తమ సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. రోడ్డు గోతులమయం కావడంతో రహదారిని బాగు చేయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మజ్జి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత శ్రమదానం

జి.సిగడాం: రాజాం–శ్రీకాకుళం ప్రధాన రహదారిలో ఆనందపురం–వాండ్రంగి గ్రామ సమీపంలో మలుపుల వద్ద డొంకలు, తుప్పలు పేరుకుపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆనందపురం యూత్ సభ్యులు ఆదివారం శ్రమదానం చేశారు. యువకులు చందాలు వేసుకుని యంత్రాల ద్వారా డొంకలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. సమస్య తాత్కాలికంగానైనా పరిష్కారం అయినందుకు వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.

'నాన్‌స్టాప్'గా రద్దీ


నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం రద్దీగా కనిపించింది. దసరా పండగ అనంతరం తిరుగు ప్రయాణాలు సాగించే వారితో జనసంద్రాన్ని తలపించింది. స్వగ్రామాల నుంచి మరలా పనుల నిమిత్తం వెళ్లేవారు, పాఠశాల కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో కిటకిటలాడింది. ప్రధానంగా విశాఖ వెళ్లే నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికులు బారులు తీరారు. పల్లెవెలుగు బస్సులను సైతం నాన్‌స్టాప్ బస్సులుగా నడిపారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సకాలంలో రాకపోవడంతో ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు.

– శ్రీకాకుళం అర్బన్


విజయవాడ-రాజమండ్రి ప్లాట్‌ఫాం వద్ద ప్రయాణికులు


బస్సులు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు


నాన్‌స్టాప్ బస్సులుగా పల్లెవెలుగు బస్సులు